క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీకాళికాంబ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామునే పంచామృతాభిషేకం, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. ఒడిబియ్యం కార్యక్రమాన్ని జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం శ్రీకాళీ మాత సేవా సమాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవ చేపట్టి అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ ఆరవేటి వాసు, ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్ర, సుబ్బాచారి, విజయ్ కుమార్, లక్ష్మీదేవి, నరసింహ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ ముందుండాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు క్రీడల్లోనూ ముందుండాలని, క్రీడలు మానసికానికి, శారీరక దృఢత్వానికి, జ్ఞాపకశక్తి పెంపుదలకు దోహదం చేస్తాయని డాక్టర్ రామకృష్ణారెడ్డి, సెక్రటరీ ఆఫ్ స్పోర్ట్స్ అడ్వైజర్ శివకిశోర్, కళాశాల డైరెక్టర్ షేమంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో 2025–26 రాయలసీమ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ యట్ టోర్నమెంట్ షటిల్ బ్యాడ్మింటన్ బాలబాలికలకు నిర్వహించారు. పోటీల్లో 9 టీంలు పాల్గొన్నాయని, 5 టీంలు బాలురు, మూడు టీంలు ఉమెన్‌లు పాల్గొన్నాయని చెప్పారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్ డీఏలు తక్షణమే చెల్లించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆర్‌జే యూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో రెండు డీఏలైనా దీపావళి కానుకగా చెల్లించాలన్నారు. పీఆర్సీ నియమించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు పూర్తయినా హామీలను అమలు చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. డీఏల కోసం గతంలో ఉద్యమాలు చేసిన దాఖలాలు లేవన్నారు. రిటైర్డు అయిన ఉద్యోగులు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పొందకుండానే చనిపోవడం బాధాకరమన్నారు.

నేడు రాగి నాణేల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నిమిషాంబదేవి ఆలయంలో ధనత్రయోదశిని పురస్కరించుకొని పట్టణ చిత్తారి సంఘం ఆధ్వర్యంలో రాగి నాణేలు ఉచితంగా అందజేస్తున్నట్లు ఆలయ పూజారి లక్ష్మణస్వామి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దసరా నవరాత్రుల్లో నిమిషాంబదేవి ప్రతిమ ఉన్న రాగి నాణేలకు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ నాణెలను ధనత్రయోదశి రోజున భక్తులకు అందజేస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల్లోపు భక్తులకు పంపిణీ చేస్తామని చెప్పారు.

పెన్షనర్స్ జిల్లా అడ్‌హాక్ సభ్యుల ఎన్నిక



సభ్యులుగా ఎన్నికైన విశ్రాంత ఉద్యోగులు

నంద్యాల(వ్యవసాయం):రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అడ్‌హాక్ సభ్యుల ఎన్నిక శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగింది. యూనియన్ జిల్లా ఎన్నికల అధికారులు రంగారెడ్డి, శేషయ్య మాట్లాడారు. గౌరవాధ్యక్షుడిగా బాలనాగిరెడ్డి, అధ్యక్షుడిగా సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి రామలింగారెడ్డి, కోశాధికారిగా వీరప్పలతో పాటు లక్ష్మీనారాయణ, ఉస్మాన్‌బాషా, తిరుపతయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆనంద్‌లు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. ఎన్నికైన నాయకులను విశ్రాంత ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



చాకరాజువేములలో జెండాల ఊరేగింపు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో దస్తగిరి స్వామి(మహబూబ్ సుభాని) గ్యార్మీ వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాల ఊరేంపులో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ కార్యాక్రమాలతో స్థానికులు సందడి చేశారు. ఊరంతా గాజులు, బొమ్మల అంగళ్లతో తిరునాల వాతావరణం నెలకొంది.

ముంచిన వాన

- ఉయ్యాలవాడలో 27.8 మి.మీ వర్షపాతం
- నీటమునిగిన పంటలు
- ఆందోళనలో రైతులు

ఉయ్యాలవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో మండల వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. నెల రోజులుగా విరామం లేకుండా వర్షాలు కురుస్తుండగా, శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. మండలంలో 27.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు నీటమునిగాయి. పంట దిగుబడులు చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్ ప్రారంభమై 18 రోజులు గడుస్తున్నప్పటికీ, వరుస వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. రసాయన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసినా భూమి తడి ఆరక సాగు ప్రారంభించలేకపోతున్నామంటూ అన్నదాతలు వాపోతున్నారు. వర్షాల కారణంగా పొలాల్లో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి సాగు పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి. మండలంలో సాధారణంగా 12,700 హెక్టార్లలో పప్పు శనగ సాగు జరుగుతుంటే, ఈసారి 14,000 హెక్టార్లలో సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వర్షాలతో ఆయా గ్రామాల్లోని కాలనీలు జలమయమయ్యాయి.



ఉయ్యాలవాడలో చెరువును తలపిస్తున్న పంట పొలం

మురుగు కాలువలు పూడిపోవడంతో రహదారులపై నీరు పారుతోంది. దోమల బెడద ఎక్కువ కావడంతో రోగాల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పడిగెపాడు గ్రామంలో నీట మునిగిన మిరప పైరు



సర్వాయిపల్లెలో రోడ్డుపై భారీగా ప్రవహిస్తున్న వాగు నీరు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు విమర్శించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన హృదయరాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగరి శ్రీనివాసులు, సాంబశివుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఉన్న నాలుగు డీఏలను చెల్లించకపోవడం, పీఆర్సీ నియమించకపోవడం, మధ్యంతర భృతి చెల్లించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నాయకులు పుల్లయ్య, రవి, మునిస్వామి, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పాల్గొన్నారు.

జీఎస్టీతో క్రీడా పరికరాల ధర తగ్గింపు

నంద్యాల: జీఎస్టీ తగ్గింపుతో క్రీడా పరికరాల ధరలు 12 నుంచి 5 శాతం వరకు తగ్గాయని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్కూరు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా టాయ్స్, స్పోర్ట్స్ దుకాణాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన జీఎస్టీ స్లాబుల సవరణ వల్ల క్రీడా పరికరాలు ఇప్పుడు 5శాతం రేటు కిందకు వస్తాయని, దీంతో డబ్బు ఆదా అవుతుందన్నారు. నంద్యాల ఎంపీడీఓ సుగుణ శ్రీ మాట్లాడుతూ స్థానిక బొమ్మల సమూహాలు, క్రీడా వస్తువుల పరిశ్రమలను



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా'' చొరవను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సెట్కూరు సూపరిటెండెంట్ శ్యాం బాబు, క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు సుదర్శన్, కిశోర్ బాలరాజు పాల్గొన్నారు.

పాలనాదక్షుడు..శ్రీకృష్ణదేవరాయలు



నంద్యాలలో శ్రీకృష్ణదేవరాయల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నేతలు

నంద్యాల(వ్యవసాయం): విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయలు మంచి పాలనదక్షుడని, ఆయన పాలన వైభవం ఎనలేనిదని నంద్యాల జిల్లా బలిజ కాపు రాక్స్ సభ్యులు పసుపులేటి జనార్ధన్, చెన్నం శెట్టి శ్రీనివాసులు, కామిని మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కార్యాలయంలో రాయల 496వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ జయంతి, వర్ధంతి, పట్టాభిషేకాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.సుబ్బరాయుడు, నాగేశ్వరయ్య,రామయ్య, హరి, కిశోర్, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయుని పాలన ఆదర్శం

ఉయ్యాలవాడ: పాలనదక్షుడిగా, ప్రజాహితవాదిగా శ్రీకృష్ణదేవరాయులు నిలిచారని ఆళ్లగడ్డ తాలూకా బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు అర్జిగారి నరసింహులు, మండల అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయుల వర్ధంతి సందర్భంగా కమతం బజార్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పాలన ఆదర్శమని, నేటి పాలకులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సంఘం నాయకులు జింకా వెంకటస్వామి, కమతం చిన్నరాముడు, సాగునీటి సంఘం చైర్మన్ ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య, బల్లారి హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

చరిత్రలో నిలిచిపోయిన రారాజు

ఆళ్లగడ్డ: శ్రీకృష్ణదేవరాయలు మంచి పరిపాలనా దక్షుడిగా అందరికీ స్ఫూర్తిదాయకంగా చరిత్రలో నిలిచిపోయారని బలిజ సంఘం నాయకులు కొనియాడారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి బలిజ సంఘం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు నల్లగట్ల బాలుడు, మైలేరి మల్లయ్య, రాందాసు, వెంకటసుబ్బయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసులపై సమాచారమివ్వండి

నంద్యాల(అర్బన్): పోలీసు స్టేషన్ల పరిధిలో 30 రోజుల క్రితం ఏవైనా మ్యాన్ మిస్సింగ్ కేసులు నమోదై ఉంటే నంద్యాల తాలూకా సీఐ ఈశ్వరయ్యకు తెలియజేయాలని నంద్యాల రూరల్ పోలీసులు కోరారు. ఇటీవల కుందూ నదిలో కొట్టుకొచ్చిన 35– 40ఏళ్ల మధ్య వయస్సు గల పురుషుడి అస్తిపంజరం నంద్యాల మండలం భీమవరం గ్రామ సమీపంలోని లభ్యమైందన్నారు. ఆ అస్తిపంజరం వివరాల కోసం పోలీసు స్టేషన్ల పరిధిలో మ్యాన్ మిస్సింగ్ కేసుల వివరాలను సెల్: 9121101092 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

దొర్నిపాడు: వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొల్యుషన్స్ బాధితులు నిరసన వీడాలని, రెండు వారాల్లో బాధ్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని డీఎస్పీ ప్రమోద్ అన్నారు. శుక్రవారం దొర్నిపాడులో నాల్గోవ రోజు నిరసనలో పాల్గొన్న బాధితులతో ఆయన మాట్లాడారు. దీంతో బాధితులు నిరసన కొనసాగించాలా? లేక వీడాలా? అనే సందిగ్ధంలో పడ్డారు. బంగారు నగలు, ఇళ్లు తాకట్టు పెట్టి ఉద్యోగాల కోసం ఒక్కొక్కరూ రూ.3.50 లక్షలు చెల్లించినట్లు బాధితులు డీఎస్పీకి తెలిపారు. ఇప్పటికే కేసు నమోదు చేశామని.. చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులందరికీ డబ్బులు వచ్చేలా చేస్తామని డీఎస్పీ భరోసా ఇచ్చారు.

పిల్లలకు మంచి విద్యనందించండి

నంద్యాల(న్యూటౌన్): తల్లిదండ్రులు పిల్లలకు మంచి విద్యను అందివ్వాలని ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. శుక్రవారం జాయ్ ఆఫ్ గీవింగ్ కార్యక్రమం నిర్వహించారు.బండిఆత్మకూరు మండలంలోని జీసీపాలెం, నెమళ్లకుంటలోని గిరిజన ప్రాంతాన్ని సందర్శించారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి భూమి పూజ

గోస్పాడు: నంద్యాల సర్వజన ఆసుపత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శుక్రవారం మంత్రి ఫరూక్ భూమి పూజ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా 50 పడకల భవనానికి క్రిటికల్ కేర్ బ్లాక్‌ను రూ.23.75 కోట్లతో నిర్మాణం చేపడుతున్నట్లు ఎస్ఈ చిరంజీవి తెలిపారు. ఆర్ఎంఓ వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, డాక్టర్ జిలానీ పాల్గొన్నారు.

విలేకరులను బెదిరించడం అన్యాయం



నంద్యాలలో ఆర్‌డీఓ విశ్వనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

నంద్యాల(అర్బన్): నకిలీ మద్యంపై పత్రికల్లో వార్తలు రాసే విలేకరులను ప్రభుత్వం బెదిరించడం అన్యాయమని సాక్షి నంద్యాల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ హరినాథ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఆర్‌డీఓ విశ్వనాథ్‌కు విలేకరులతో పాటు ప్రజా సంఘాల నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యంపై సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురించడంతో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు జిల్లా విలేకరులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. సీపీఎం నాయకులు పుల్లా నరసింహులు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్‌కు నోటీసుల పేరుతో పోలీసులు వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. కక్ష సాధింపు చర్యలో భాగంగానే నెల్లూరు సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ మస్తాన్‌రెడ్డి ఇంటికి పోలీసులు వెళ్లి నోటీసులు అందజేసి భయాందోళన సృష్టించారన్నారు. పలువురితో పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు ఇప్పించి విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం కక్ష పూరిత చర్యగా అభివర్ణించారు. నంద్యాల ఆర్‌సీ ఇన్‌చార్జి బాలమద్దిలేటి, పాత్రికేయులు చంద్రవరప్రసాద్, దస్తగిరి, ద్వారకానాథ్, నాగేశ్వరరెడ్డి, గిరిబాబు



ఆళ్లగడ్డ: తహసీల్దార్ జ్యోతి రత్నకుమారికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

సాగర్, రాము, ప్రజా సంఘాల నాయకులు బాలవెంకట్, శశిధర్‌రెడ్డి, రాంబాబు, సుమంత్ పాల్గొన్నారు.

నిరసన గళం

ఆళ్లగడ్డ: పత్రికా స్వేచ్ఛను హరించడం తగదని మాలల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెన్నెం సుధాకర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు అమడాల రమణ అన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం గురించి ప్రశ్నిస్తున్న సాక్షి దినపత్రికపై ప్రభుత్వం కక్షగట్టి ఆ పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జ్ మస్తాన్‌రెడ్డిలపై కక్షసాధింపులకు పాల్పడటంపై శుక్రవారం ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ జ్యోతిరత్నకుమారికి వినతి పత్రం అందజేశారు.

వైద్యరంగ పురోగతిలో అనెస్తీషియా పాత్ర కీలకం



కరపత్రాలను విడుదల చేస్తున్న వైద్యులు

గోస్పాడు: వైద్యరంగ పురోగతిలో అనెస్తీషియా వైద్యు లది కీలక పాత్ర అని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలో ని మధుమణి నర్సింగ్ హోంలో అనస్తీషి యా వైద్యుల ఆధ్వర్యంలో ప్రపంచ అనెస్తీషియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనెస్తీషియా పితామహుడు విలియం థామస్ గ్రీన్ మార్టన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన శస్త్ర చికిత్సల్లో అనెస్తీషియా ఎంతో కీలకమైందన్నారు. ఈ రంగంలో కృత్రిమ మేధ వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం అనెస్తీషియాపై ప్రజా అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. డాక్టర్లు రవికృష్ణ, మధుసూదనరావు, విజయభాస్కరరెడ్డి, సహదేవుడు పాల్గొన్నారు.

నేడు క్రీస్తు ఆలయ 22వ ప్రతిష్ఠోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని డయాసిస్ పరిధిలో టెక్కెలో ఉన్న పాస్టరేట్–5 క్రీస్తు ఆలయం 22వ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పాస్టరేట్ చైర్మన్ రెవరెండ్ ఎం.సుమిత్ర కుమార్, సెక్రటరీ ఎం.బాలచంద్రుడు, ట్రెజరర్ విల్సన్ శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ కార్యక్రమానికి నంద్యాల అధ్యక్ష ఖండపు పీఠాధిపతి ది రైట్ రెవరెండ్ కామనూరి సంతోష్ ప్రసన్నరావు(బిషప్) హాజరవుతారని చెప్పారు. ఉదయం ఆలయ చుట్టూ ప్రదక్షిణలతో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. పాస్టరేట్ కమిటీ సభ్యులు ప్రభుదాసు, సుధాకర్, ఏసురత్నం, మధుసూదన్‌బాబు, నవీన్, స్త్రీల మైత్రి సంఘ సభ్యులు సరళమ్మ, అనిత, అమల, సుధారాణి పాల్గొంటారని వివరించారు.

19న కృతజ్ఞతార్పణల పండుగ..

పట్టణంలోని పాస్టరేట్–5 క్రీస్తు ఆలయంలో జరిగే కృతజ్ఞతార్పణల పండుగను విజయవంతం చేయాలని పాస్టరేట్ చైర్మన్ సుమిత్ర కుమార్ శుక్రవారం తెలిపారు. ఆనవాయితీ ప్రకారం ఏటా సంఘంలో జరిగే కోత పండుగ కార్యక్రమానికి క్రైస్తవ కుటుంబాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా ఆరాధనోత్సవం

నంద్యాల(అర్బన్): మిట్నాల గ్రామంలో వెలసిన అవధూత శివరామస్వామి ఆరాధన మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పురోహితులు ప్రభాకర్ శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఉత్సవాల్లో మొదట రుద్రాభిషేకం, పుష్పాభిషేకాలు జరిపించారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి

నంద్యాల(అర్బన్): విద్యుత్ సంస్థలను నష్టాలపాలు చేసే ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, విద్యుత్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్2, జీపీఎఫ్, పాత పెన్షన్ కల్పించాలని, పెండింగ్ డీఏలు ఇవ్వాలని, పీసీ రేట్ వర్కర్లందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

న్యాయవాదిని శిక్షించాలి

నంద్యాల(అర్బన్): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై న్యాయవాది బూటు విసరడం దుర్మార్గపు చర్యగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు నరసింహులు మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ మాదిగ అభివర్ణించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు రాము మాదిగ, దిబ్బన్న మాదిగ, పుల్లయ్య మాదిగ, అంజిమాదిగ పాల్గొన్నారు.

ఆర్‌డీఓ కార్యాలయం వద్ద..

ఆ న్యాయవాది లైసెన్స్ రద్దు చేసి అరెస్ట్ చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు బొమ్మలసత్రం వద్దనున్న



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కోల కల్యాణ్ మాదిగ, లాయర్ బాలస్వామిల ఆధ్వర్యంలో ఆర్‌డీఓ విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు.

గోస్పాడు: చీఫ్ జస్టిస్‌పై బూటు విసిరిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పాలకృష్ణ, ఓబులపతి కోరారు. రాష్ట్ర ఎమ్మార్పీఎస్ పిలుపు మేరకు శుక్రవారం గోస్పాడులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ హరితకు వినతి పత్రం అందజేశారు. నాగన్న, మద్దిలేటి, మహేష్ పాల్గొన్నారు.

ఆశలన్నీ రబీపైనే

- జోరుగా జొన్న, మొక్కజొన్న, మినుము సాగు
- గత ఏడాది నష్టాలతో ఆందోళన

రుద్రవరం: రబీ సీజన్ ప్రారంభమవడంతో మండల రైతులు సేద్య పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జొన్న, మొక్కజొన్న, మినుము వంటి పంటల విత్తనాలు కూలీలు, ట్రాక్టర్ల సాయంతో వేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్ రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. ఆరంభంలో వాతావరణం అనుకూలించినా, దిగుబడులు చేతికొచ్చే సమయానికి కురిసిన వర్షాలు పంటలను దెబ్బతీశాయి. ప్రభుత్వం నుంచి మద్దతు, పంట బీమా, నష్టపరిహారం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓ వైపు వర్షాలు, మరోవైపు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మొక్కజొన్న పంటను తక్కువ ధరలకు విక్రయించాల్సి వచ్చింది. అయితే, చేతికొచ్చిన సొమ్ముతోనే రైతులు రబీ పంటలకు సన్నాహాలు ప్రారంభించారు. పొలాల్లో వ్యర్థాలను తొలగించి, సేద్య పనులు పూర్తి చేసి జొన్న, మినుము, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మండల పరిధిలోని పేరూరు, ఎర్రగుడిదిన్నె, చిలుకలూరు, నర్సాపురం తదితర గ్రామాల్లో రబీ సీజన్ పనులు జోరుగా సాగుతున్నాయి. గతేడాది రబీలో 2,494 హెక్టార్లలో జొన్న, 2,126 హెక్టార్లలో మొక్కజొన్న, 1,924 హెక్టార్లలో మినుము సాగు జరిగిందని, ఈ సంవత్సరం విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.



నర్సాపురంలో మొక్కజొన్న విత్తుతున్న కూలీలు



పేరూరులో జొన్న విత్తనం వేస్తున్న రైతులు

రేపు ఉచిత వైద్య శిబిరం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19 తేదీన పట్టణంలోని జగన్ ఆసుపత్రి ఆవరణలో పీఆర్టీయూ ఉద్యోగ ఉపాధ్యాయులకు, పెన్షనర్ల కుటుంబాలకు అపోలో ఆసుపత్రి సీనియర్ కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు బజార్ సమీపంలోని జగన్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యులు కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్డియాలజిస్ట్ సొమ్యారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉయ్యాలవాడ: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ హుసేన్ బాషా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి సంబంధించి త్రీఫేస్ కరెంట్ తెల్లవారుజామున 3 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు.